క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని ఐదో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అఖిలపక్ష ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో వార్డులో పర్యటించి సమస్యలను ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. 20వ వార్డు నుంచి వచ్చే మురుగు వెళ్లేందుకు డ్రెయినేజీ లేకపోవడంతో ఐదో వార్డులోని ఇళ్ల మధ్య నీరు నిలిచి దుర్వాసన రావడంతో పాటు పందుల సంచారం ఎక్కువైందని కాలనీ వాసులు ఐక్య వేదిక సభ్యులకు వివరించారు. వార్డు కౌన్సిలర్, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు స్పందించి ఆ కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఐక్యవేదిక నాయకులు కోరారు. లేదంటే ఆ కాలనీ ప్రజలతో ఎన్నికల తర్వాత ప్రజా సంఘర్షణ దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, గంధం నాగరాజు, సతీష్‌కుమార్, శివకుమార్, కురుమూర్తి, రాములు తదితరులు పాల్గొన్నారు.

మాసశివరాత్రి పూజలు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులోని వైరాలగుట్టపై వెలసిన శివాలయంలో సోమవారం మాసశివరాత్రి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శివుడికి అభిషేకం చేయడంతో పాటు భక్తులు భజన కీర్తనలు ఆలపించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి మాసశివరాత్రి రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, యాదిరెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రవీణ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోపాలపేట: మండలానికి చెందిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గోపాల్‌పేట ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని జింకలబీడుతండాకు చెందిన ఆంగోతు శ్రీను (38) హైదరాబాద్‌లో మేస్త్రీ పనిచేస్తూ జీవనం గడిపేవాడు. ఏప్రిల్ 21 తేదీన తన చెల్లెలు పెళ్లి ఉండగా గ్రామానికి వచ్చాడు. మే 1 రాత్రి పది గంటల సమయంలో గోపాల్‌పేటకు ద్విచక్ర వాహనంపై వస్తూ పొలికెపాడు సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సమ్మర్ క్యాంపు ప్రారంభం



కొల్లాపూర్: రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపు సోమవారం నుంచి ప్రారంభమయ్యింది. పట్టణంలోని మినీ స్టేడియంలో విద్యార్థులను ఉద్దేశించిన ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ మాట్లాడారు. స్పోర్ట్స్, అథ్లెటిక్స్‌తో పాటు విద్యార్థుల్లో మానసికోల్లాసం కలిగించే అంశాలకు క్యాంపులో ప్రాధాన్యం ఇస్తామన్నారు. నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యక్తికి కౌన్సెలింగ్



పెద్దకొత్తపల్లి: చంద్రకల్ గ్రామానికి చెందిన వనపట్ల జమదగ్ని భార్య వసంత గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రాలేదని మనస్తాపంతో సోమవారం జమదగ్ని భార్యకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటానని తెలిపాడు. ఈ విషయాన్ని బంధువులు పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ సతీష్ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌ఐ వెంటనే స్పందించి నాగర్‌కర్నూల్ ఐటీ కోర్ టీం సభ్యుల సహాయంతో జమదగ్ని తిమ్మాజీపేట ఏరియాలో ఉన్నట్లు గుర్తించి అతడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు.

అపరిశుభ్రంగా బోరింగ్‌పంపు

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెంలోని మురికితో అపరిశుభ్రంగా ఉన్నా, శుభ్రం చేయకుండా అందులోనే బోరింగ్ మోటారును అమర్చారు. పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు చెప్పినా పట్టించుకోకుండా అమర్చడంతో మురికి కంపుతో ప్రజలకు రోగాలు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. బోరుపంపు నుంచి వచ్చిన నీటిని తాగడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా బోరింగ్ దగ్గర శుభ్రపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా అతిథి గృహం



నిరుపయోగంగా మారిన అతిథి గృహం

- భవన నిర్వహణకు నిధులు లేమి
- చెత్తాచెదారంతో పరిసరాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురంలో ఉన్న పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు వచ్చే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పర్యాటకులు విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించిన అతిథిగృహం నిరుపయోగంగా మారింది. అతిథి గృహం నిర్వహణ లేకపోవడంతో భవనం ఆవరణలో మద్యం సీసాలు, కంప చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి విషసర్పాలు, మందు బాబులకు నిలయంగా మారింది. 2012లో సుమారు రూ.75 లక్షలతో ఆలయ ఆవరణలో నిర్మించిన ఈ భవనానికి అప్పట్లో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పూర్తి హంగులు రూపుదిద్దుకొని ప్రారంభానికి సిద్ధం చేశారు.

మండలం ఏర్పాటుతో..

జిల్లాల పునర్విభజనలో భాగంగా శ్రీరంగాపురం గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేశారు. దీంతో అతిథి గృహంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. కొద్దిరోజుల తర్వాత అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌ను వేరే ప్రభుత్వ భవనంలోని మార్చారు. అప్పటి నుంచి కొద్ది రోజులు తహసీల్దారు కార్యాలయం వారు భవన నిర్వహణను చూసుకునేవారు. ఆ తర్వాత భవన నిర్వహణకు లేకపోవడంతో తాళం వేశారు. అప్పటి నుంచి భవనాన్ని పట్టించుకోకపోవడంతో ఫర్నీచర్, ఫ్యాన్లు, ఏసీలు, తలుపులు, కరెంటు సామగ్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతుంది. భవనంలోకి అడుగుపెడితే దుర్వాసన వస్తోంది. ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారడంతో పర్యాటకులు, యాత్రికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

పేరుకుపోయిన చెత్త

మండల కేంద్రంలో నిర్మించిన అతిథి గృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలి. భవన చుట్టు పరిసరాలు చెత్తాచెదారం, కంపచెట్లతో నిండిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి భవనాన్ని సుందరీకరించి పర్యాటకులకు అందుబాటులోకి తేవాలి.

– రామలింగం, శ్రీరంగాపురం

పర్యవేక్షణ కరువు

శ్రీరంగనాయక స్వామి ఆలయాన్ని వచ్చే భక్తులు సేద తీరడానికి అతిథి గృహం అన్ని హంగులతో ఏర్పాటు చేశారు. కానీ వినియోగంలోకి తీసుకురాలేదు. పర్యవేక్షణ లేక నిరుపయోగంగా మారింది. ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడికి వచ్చే యాత్రికులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తేవాలి.

– రవీందర్, శ్రీరంగాపురం

కూలీలకు తాగునీటి వసతి కల్పించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వీపనగండ్ల: గ్రామాల్లో ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలకు పని ప్రదేశంలో తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం గోపల్‌దిన్నె శివారులో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో కలుషితమైన నీరు తాగడం వల్ల పలువురు కూలీలు అస్వస్థతకు గురవుతున్నారని, వెంటనే ఫిల్టర్ నీటిని కూలీలకు అందించాలని డిమాండ్ చేశారు. నీడ కోసం టెంట్లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఉదయం 6 గంటల నుంచే పనులు ప్రారంభించాలని, ఫీల్డ్ అసిస్టెంట్ లేని గ్రామాల్లో తక్షణమే నియామకాలు చేపట్టాలని, ప్రతి రోజు 600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ తరువాత పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగి శ్రీకాంత్‌కు అందజేశారు. కార్యక్రమంలో నిరంజన్, భాస్కర్ పాల్గొన్నారు.

జిల్లాల కుదింపుపై అనవసర రాద్ధాంతం



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

వనపర్తి: జిల్లాల కుదింపుపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అధికారిక ప్రకటన చేయకపోయినా.. ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేయటం సరికాదని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 1, 2 మున్సిపల్ వార్డుల్లో ఆయన లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రెండుసార్లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జిల్లాల కుదింపుపై సీఎం స్పందించాలని డిమాండ్ చేయడం అర్థరహితమని కొట్టిపడేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పగిడాల శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాగ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, శ్రీనివాస్ గౌడ్, చీర్ల చందర్, సతీష్, చుక్కరాజు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మల్లు రవికి మద్దతు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు తాడిపర్తిలో ప్రచారం నిర్వహించారు కార్యక్రమంలో సత్యశీలారెడ్డి, భార్గవి, శేఖర్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని కంచిరావుపల్లికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ సుజాత, మాజీ ఉపసర్పంచ్ భాస్కర్‌తో పాటు పలువురు నాయకులతో కలిసి భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి సోమవారం వనపర్తి పట్టణంలోని నందిహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సమక్షంలో 100 మంది బీఆర్‌ఎస్ నాయకులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనుల్లో తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేశాం. అలాంటి తమకు బీఆర్‌ఎస్‌లో గౌరవం దక్కలేదని వాపోయారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, భానుప్రకాష్‌రెడ్డి, రంజిత్‌కుమార్, సురేందర్‌గౌడ్, వెంకటేష్ సాగర్, తేజవర్ధన్ పాల్గొన్నారు.

‘రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడింది’



అమరచింతలో ప్రచారంలో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



దావాజిపల్లిలో..

ఆత్మకూర్: కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, కారు గుర్తుకు ఓటువేసి ఎంపీగా మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, వైస్ ఎంపీపీ కోటేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. సోమవారం ఆత్మకూర్‌తో పాటు గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండ్ల రామకృష్ణ, కొత్తబోయ శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరచింత: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు నిధులు అధికంగా మంజూరు చేసుకునే అవకాశం ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేందర్‌సింగ్ అన్నారు. పట్టణంలో సోమవారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈమేరకు స్థానిక అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని పది వార్డుల్లో బూత్ కమిటీ అధ్యక్షులు వార్డుల్లో పర్యటిస్తూ బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నరసింహులుగౌడ్, ఉపాధ్యక్షుడు బాలరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్‌ఏ రాజు, నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం మండలంలోని దావాజిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, మరోసారి మోసపోకుండా బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. కార్యక్రమంలో వెంకటయ్యనాయుడు, అశోక్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో ఉద్యమకారులకు గుర్తింపు ఏది?



కొత్తకోట రూరల్: మండలంలోని రామనంతాపురం గ్రామానికి చెందిన మహేష్ తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్రం సాకారం కావాలని ఉమ్మడి 10జిల్లాల్లో పాదయాత్ర చేయడంతో పాటు 2012లో సైకిల్ యాత్ర చేసి ప్రత్యేక రాష్ట్రం కోసం తనవంతు పాత్ర పోషించాడు. తెలంగాణ ఏర్పాటు అనంతరం తన పేరుకు ముందు తెలంగాణ మహేష్(టీజీ మహేష్) అని పిలిపించుకుంటూ సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు పలువురి సహకారంతో పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పలువురు మన్ననలు పొందాడు. అయితే తనను బీఆర్‌ఎస్ పార్టీ గుర్తించకపోవడంతో పాటు సరైన గౌరవం ఇవ్వలేదని, కొంత కాలంగా వేదనకు గురవుతూ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరాడు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు కరాటే శివయాదవ్, గోవర్ధన్, శ్రీకాంత్, లక్ష్మీకాంత్‌రెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఆదరించండి



మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: వనపర్తి నియోజకవర్గాన్ని విద్య, వైద్య, వ్యవసాయ రంగాలలో అగ్రస్థానంలో నిలిపామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆయన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా సోమవారం పెబ్బేరు మండలంలోని రంగాపురంలో ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల పని ప్రదేశానికి వెళ్లిన ఆయన బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వనం రాములుయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, జెడ్పీటీసీ పద్మ, గట్టయ్య, మీడియా కన్వీనర్ వడ్డె రమేష్, కృష్ణారెడ్డి, వేణురెడ్డి, గోవిందునాయుడు ,వెంకట స్వామి ,రాజశేఖర్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళకు తీవ్రగాయాలు

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన ద్వారం ఎదుట నిల్చొన్న మహిళపై ఆర్టీసీ బస్సు వెళ్లడంతో మహిళకు తీవ్రగాయాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చుక్కాయిపల్లి గ్రామానికి చెందిన సాతాని లక్ష్మీదేవమ్మ(55) బస్టాండ్ ప్రధాన ద్వారం ఎదుట మూలమలుపు వద్ద నిల్చొని ఉంది. నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్ వస్తున్న ఆర్టీసీ బస్సు మహిళపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవమ్మ ఎడమకాలు తెగిపోయింది. స్థానికులు ఆమెను వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు.

‘బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దవుతాయి’



ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

అమరచింత: బీజేపీ మరోమారు పార్లమెంట్ ఎన్నికల్లో గెలిస్తే రాజ్యాంగంలో ఉన్న రిజర్వేషన్లను రద్దు చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. మండలంలోని సింగంపేటలో సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. బీజేపీతో ప్రజాస్వామ్యానికి, లౌకిక వ్యవస్థకు ముప్పుపొంచి ఉందన్నారు. దేశాన్ని హిందూ దేశంగా మార్చాలనే తలంపుతో మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. బీజేపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. బీఆర్‌ఎస్ అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందని దుయ్యబట్టారు. కేసీఆర్ నియంతృత్వ పాలన కొనసాగించారని, పదేళ్ల పాలనలో పేదల సంక్షేమన్ని విస్మరించిన కేసీఆర్‌కు మరోసారి బుద్ధి చెప్పాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి మోషా, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, లక్ష్మీనారాయణ శెట్టి, మల్లేష్, వెంకటేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా విద్యుత్ ఇనుప స్తంభం



అమరచింత సంతోష్‌నగర్‌లో వైర్లు బిగించని సిమెంట్ స్తంభం

అమరచింత: పట్టణంలోని సంతోష్‌నగర్‌లో ఇనుప విద్యుత్ స్తంభం ఎప్పుడు కూలుతోందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. మూడు నెలల కిందట విద్యుత్ తీగలు తెగి పడటంతో ఒరిగిన ఇనుప స్తంభం తొలగించి సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులు భావించారు. వెంటనే ఇనుప విద్యుత్ స్తంభం పక్కనే సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేసినా.. ఇప్పటి వరకు దానికి వైర్లు బిగించలేదు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు, మున్సిపాలిటీ అధికారులు స్పందించి విరిగి పోవటానికి సిద్ధంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం తొలగించి సిమెంట్ స్తంభానికి వైర్లు బిగించాలని కోరుతున్నారు.

‘దేశ భవిష్యత్ మోదీ చేతిలోనే భద్రం’



వెంకటాంపల్లిలో బీజేపీలో చేరిన యువకులతో ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్

ఖిల్లాఘనపురం: దేశ భవిష్యత్ కోసం బీజేపీకి ఓటు వేసి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇవ్వాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ అన్నారు. సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని సోళీపురం, మానాజీపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని తన ఇల్లుగా భావించే మోదీతోనే యువత భవిష్యత్ భద్రంగా ఉంటుందన్నారు. మోదీని మూడోసారి ప్రధానమంత్రిగా చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే తనను గెలిపించాలని అభ్యర్థించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో దేశంలో ఎన్నో అల్లర్లు, మోసాలు, కుంభకోణాలు జరిగాయని, బీజేపీ పదేళ్ల కాలంలో ఎక్కడ అవినీతికి తావివ్వకుండా ప్రధాని పాలన సాగించారని కొనియాడారు. అనంతరం మండలంలోని వెంకటాంపల్లికి చెందిన యువకులు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరగా ఆయన వారికి బీజేపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాసులుగౌడ్, జిల్లా పంచాయతీ రాజ్ సెల్ కన్వీనర్ విక్రం, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు శివశంకర్, సత్యనారాయణ, జిల్లా కిసాన్‌మోర్చా కార్యదర్శి రాంరెడ్డి, ఆశన్న, రాంచందర్, గోపి, దశరథ, చక్రవర్తిగౌడ్, ఈదమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కంభాళాపురంలో..



కంభాళాపురంలో..

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ గెలుపు కోసం శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో, పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి, రంగాపురం గ్రామాల్లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, వెంకట్రాంరెడ్డి, భగవంతుయాదవ్, దీపక్, గొడుగు సురేష్, బాలరాజు, రాముడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

అమరచింత: పట్టణానికి చెందిన తొమ్మిదో వార్డులో బీఆర్‌ఎస్ పార్టీ 232 బూత్ అధ్యక్షుడు నెల్లికొండి అరేందర్‌రెడ్డి దంపతులతో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు సోమవారం బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. మండలంలో రోజురోజుకూ బీజేపీ అభ్యర్థి అరుణ గెలుపు కోసం పలువురు బీజేపీలో చేరుతున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్ తెలిపారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభివృద్ధి చెందాలంటే బీజేపీ ద్వారానే సాధ్యమన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు, దుబాయి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనే కాంగ్రెస్ ఎజెండా



వనపర్తిలో మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఏఐసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదిత్యారెడ్డి, నాయకులు

వనపర్తి టౌన్: యవతకు, నిరుద్యోగులకు కాంగ్రెస్ వస్తేనే లాభం చేకూరుతుందని ఏఐసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంవైఎస్ మినీ హాల్‌లో పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండీ బాబా అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రొఫెషనల్ కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చిన బీజేపీ నిరుద్యోగులను నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రొఫెషనల్ కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేశారు. కార్యక్రమంలో నేషనల్ స్టేట్ టీమ్ నావికా హార్సె, స్టేట్ రూం ఇన్‌చార్జ్ రాహుల్‌రెడ్డి, చాప్టర్ ప్రెసిడెంట్ ఇర్ఫాన్, మలోక్జ్‌గిరి చాప్టర్ ప్రెసిడెంట్ కార్తీక్‌రెడ్డి, ఏఐపీసీ జిల్లా కోఆర్డినేటర్ నాగిరెడ్డి, వంశీ, నాగార్జున, బీసీ సెల్ అధ్యక్షుడు కోట్లరవి, పెంటన్న, గణేష్‌గౌడ్, చీర్ల జనార్ధన్‌సాగర్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: దేశం కోసం ధర్మం కోసం అంటూ దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ అదానీ, అంబానీలకు బీజేపీ ఊడిగం చేస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి కేషం నాగరాజుగౌడ్ దుయ్యబట్టారు. సోమవారం మున్సిపాలిటీలోని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు యావత్తు ప్రజలందరూ ఎదురు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసీరాజ్, నల్గొండ శ్రీను ఉన్నారు.

అమరచింత: కాంగ్రెస్ బలపర్చిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలంటూ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, కౌన్సిలర్ మాధవి, మహేందర్‌రెడ్డి ,అరుణ్‌కుమార్, జుబేర్‌అహ్మద్ పాల్గొన్నారు.

పాన్‌గల్: నాగర్‌కర్నూల్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా.మల్లురవికి మద్దతుగా సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు శాగాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ డైరెక్టర్ బాలరాజుయాదవ్, బాలరాజు, నాగేష్, శ్రీను, రాములు తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: పేదల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు పనిచేస్తుందని, పార్లమెంటు ఎన్నికల్లో మహబుబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. నర్సింగాపురం, మదనాపురం, రామన్‌పాడు, అజ్జకొల్లు తదితర గ్రామాల్లో ప్రచారం కొనసాగింది. దుప్పల్లిలో ఆంజనేయస్వామి, పోచమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సాయిబాబా, రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, సత్యం పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..

రిజర్వేషన్ల ఆద్యుడు సాహుమహరాజ్



సాహుమహరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి: తన రాజ్యంలో రిజర్వేషన్లు అమలు చేసి దేవాలయాల కంటే విద్యకే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి, గుడులను బడులుగా మార్చిన మహోన్నతుడు సాహు మహారాజ్ అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. సోమవారం సాహు మహారాజ్ వర్ధంతి సందర్భంగా టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జై భీమ్ సేవా సంస్థ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ ఫలాలకు ఆద్యుడు సాహుమహారాజ్ చక్రవర్తి అని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్వాతంత్ర్యానికి పూర్వమే సమాన అవకాశాలు, రిజర్వేషన్ ఫలాలు అవసరమని భావించిన రుషితుల్యుడు సాహు మహారాజ్ అని కొనియాడారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, గంధం నాగరాజు, పెద్ద నిరంజనయ్య, చిన్న నిరంజన్, రాధాకృష్ణ, వేణుగోపాల్‌నాయుడు, కేశపాగ వెంకటేష్, మద్దిలేటి, మిద్దె నాగయ్య తదితరులు పాల్గొన్నారు.